## క్లుప్తంగా

### ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13, నల్ల వంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 50, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 35, పందిరిబీర 45, క్యాబేజీ 10, క్యారెట్ 21, దొండ 23, గుండుబీన్స్ 35, గింజ చిక్కుడు 50, గోకరకాయ 37, కీర 23, దోసకాయ 21, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 18, ఆలు గడ్డ 21, చామగడ్డ 70, మొరంగడ్డ 18, కందగడ్డ 23, సొరకాయ 11, పొట్లకాయ 15, అరటికాయ 9 (ఒకటి), మునగకాయ 4-6, ముల్లంగి 3-5. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

### నేడు బహుమతుల ప్రదానం

సనత్‌నగర్: ఖైరతాబాద్ సర్కిల్-17 పరిధిలోని సీనియర్ సిటిజన్స్‌కు నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి సోమవారం బహుమతుల ప్రదానోత్సవం జరుగుతుందని ఆసరా కమిటీ ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ శాయి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసరా కమిటీ అధ్యక్షుడు, డిప్యూటీ కమిషనర్ మోహన్ రెడ్డి అధ్యక్షతన ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, గౌరవ అతిథిగా ప్రాజెక్ట్ ఆఫీసర్ దామోదర్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

### నేటి నుంచి కబడ్డీ పోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ మోడల్ స్కూల్‌లో నేడు, రేపు ముషీరాబాద్ మండల స్థాయి కబడ్డీ పోటీలు జరగనున్నాయి. బల్దేవ్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నేడు ప్రారంభంకానున్న కబడ్డీ పోటీలను ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, మోడల్ స్కూల్ స్పెషల్ ఆఫీసర్ ప్రొ.శంకర్, స్కూల్ హెచ్‌ఎం జ్యోతిశ్రీ ప్రారంభించనున్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.5 వేలు, రెండో బహుమతి రూ.3 వేల నగదును అందచేయనున్నట్లు నిర్వాహకులు సుధాకర్, గోపి తెలిపారు.

### నిధులు కేటాయించాలని వినతి



కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

అడ్డగుట్ట: తుకారాంగేట్‌లోని పహాడీ హనుమాన్ దేవాలయానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన బీజేపీ నేతలు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి గాజుల హంసరాజు మాట్లాడుతూ.. తుకారాంగేట్ ప్రసిద్ధి చెందిన పహాడీ హనుమాన్ దేవాలయం అభివృద్ధికై ప్రత్యేక నిధులు కేటాయించి, దేవాలయ సుందరీకరణకు తోడ్పాటు అందించాలన్నారు. వినతి ఇచ్చిన వారిలో మహేష్‌గౌడ్ ఉదయ్ యాదవ్, రాజేష్ పాల్గొన్నారు.

### రేవంత్‌రెడ్డిని కలిసిన టీ-జాక్ నేతలు



లాలాపేట: తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ(టీ-జాక్) నేతలు ఆదివారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 6న మేడారం నుంచి తలపెట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర విజయవంతం కావాలని కోరుతూ యాత్రకు టీ-జాక్ తరఫున మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం, శ్రీరామ్ శివకుమార్, ఆర్వి శ్రీనివాస్, నవీన్ పాల్గొన్నారు.

### నూతన వేతన ఒప్పందాన్ని అమలు చేయాలి

ముషీరాబాద్: ఆర్టీసీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న నూతన వేతన ఒప్పందం అమలు చేయాలని ఆర్టీసీ తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యానగర్ సంఘం కార్యాలయంలో ఆదివారం కార్మిక సంఘాలైన టీజేఎంయూ, బీడబ్ల్యూయూ, కేఎస్, కేపీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ సంస్థ మనుగడ సాగించాలంటే ప్రస్తుత వార్షిక బడ్జెట్ రూ.6 వేల కోట్లను కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆదుకోకపోతే ఆర్టీసీ కార్మికులకు వేతనాలు వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని ప్రయత్నాలు చేసిన 1వ తేదీన కార్మికులకు వేతనాలు చెల్లించే పరిస్థితి లేదన్నారు. కార్మిక సంఘాల నాయకులు సుద్దాల సురేష్, యాదగిరి, శ్యామలయ్య, శివకుమార్, పీ.కె.ఎం.మూర్తి, బాలస్వామి, రాములు, సుధాకర్ తదితరులున్నారు.

## సమస్యల పరిష్కారానికి ..

# నిచ్చెన లేదట!



పద్మారావునగర్ ప్రధాన రహదారిలో వీధిదీపాలకు అడ్డుగా చెట్ల కొమ్మలు



గండిమైసమ్మ దేవాలయం వద్ద ఎండిపోయి ప్రమాదకరంగా మారిన చెట్టు

- విద్యుత్ తీగలు, వీధి దీపాలకు అడ్డుగా చెట్ల కొమ్మలు
- ఫిర్యాదు చేస్తే ఒకటే నిచ్చెన ఉందంటూ దాటవేత
- సమస్యల పరిష్కారానికి చొరవ చూపని ఉద్యానశాఖ
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- సిబ్బంది కొరత కూడా ప్రధాన కారణం

బన్సీలాల్‌పేట్: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాల్సిన అధికారులు వాటిపై దృష్టి సారించకపోవడంతో వివిధ సమస్యల కారణంగా ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. జీహెచ్‌ఎంసీ బేగంపేట్ సర్కిల్ ఉద్యాన శాఖ పనితీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాల్సిన సదరు విభాగం అధికారులు రకరకాల కారణాలు చూపుతూ నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయా ప్రాంతాల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల పక్కన, వీధిదీపాలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడానికి నెలల తరబడి సమయం తీసుకుంటున్నారు. రెండు సర్కిళ్లకు కలిపి ఒక్కటే నిచ్చెన ఉన్న కారణంగా పరిష్కారానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని అధికారులు పేర్కొనడం గమనార్హం. ముఖ్యంగా ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పార్కుల నిర్వహణ కూడా అధ్వానంగా తయారైంది. పార్కుల్లో పలు సమస్యలు రాజ్యమేలుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. దరిమిలా పార్కుల్లోకి సేద తీరడానికి, వాకింగ్ చేయడానికి వచ్చే సందర్శకులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యమే సమస్యలకు కారణం అవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.

**సమస్యలు ఇవీ..**

- సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ఎండిపోయిన చెట్లను తొలగించడం, రోడ్డు, వీధిదీపాలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను వెంటనే తొలగించాలి.
- పద్మారావునగర్, బోయిగూడ, బోలక్‌పూర్, గొల్లకొమురయ్య కాలనీ, రాణిగంజ్, ఆర్పీ రోడ్డు, మోండా మార్కెట్ తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వృక్షాల కొమ్మలు వీధి దీపాలకు అడ్డుగా ఉన్నాయి. రాత్రి వేళల్లో చీకటి కమ్ముకోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి.
- సదరు విభాగానికి ప్రతి రోజు 20 నుంచి 25 వరకు ప్రజల నుంచి ఫిర్యాదు వస్తున్నాయి. అయితే వాటిలో ఐదారు సమస్యలపైనే దృష్టి సారిస్తున్నారు.
- ఉద్యాన శాఖ విభాగం అధికారులు, సిబ్బంది సమస్యలపై సకాలంలో స్పందించడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. చెట్ల కొమ్ములను తొలగించడానికి సికింద్రాబాద్, బేగంపేట్ రెండు సర్కిళ్లకు కలిపి ఒకే ఒక ల్యాడర్ ఉంది. అయితే సిబ్బంది తాము అనుకున్నది తమకు నచ్చిన సమస్యలను మాత్రమే పరిష్కరిస్తున్నారు.
- బన్సీలాల్‌పేట్ డివిజన్ గొల్లకొమురయ్య కాలనీ రోడ్డులో చెట్ల నుంచి చిన్న చిన్న పురుగులు సదరు రహదారి గుండా వెళ్లే వారిపై పడుతున్నాయి. దీంతో పలువురు చర్మ సమస్యలకు గురవుతున్నారు. ఈ విషయమై స్థానిక ప్రజలు సదరు పురుగుపట్టిన కొమ్మలను తొలగించాలని ఫిర్యాదు చేసినా ఇంతవరకు పట్టించుకునేనాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- పద్మారావునగర్ ఈద్గా మైదానం ప్రధాన రహదారిలో వీధి దీపాలకు అడ్డుగా చెట్ల కొమ్ములు భారీ విస్తరించాయి.
- విద్యుత్, ఉద్యాన శాఖల మధ్య సమన్వయం, సహకార లోపం కారణంగా అనేక ప్రాంతాల్లో ఉద్యాన శాఖ సిబ్బంది విద్యుత్తు స్తంభాలు, వీధిదీపాల కింద మొక్కలు పెంచుతున్నారు. అవి పెరిగి పెద్దవై వీధి దీపాలకు అడ్డుగా ఉంటున్నాయి. వీటిని ఎప్పటికప్పుడు తొలగించాల్సిన సిబ్బంది తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.
- ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో పార్కు నిర్వహణ చెత్తా చెదారంతో అధ్వానంగా తయారయ్యాయి. వీటిని నిర్వహణ చేయాల్సిన కాంట్రాక్టర్ సరైన విధంగా పార్కును శుభ్రంగా ఉంచడం లేదు. పార్కు అవసరాలకు అనుగుణంగా సదరు కాంట్రాక్టర్ సిబ్బందిని నియమించకపోవడంతో పార్కు పచ్చదనాన్ని కోల్పోయి చెత్తా చెదారం, వ్యర్థాలకు ఆవాసాలుగా మారుతున్నాయి. పద్మారావునగర్, బోయిగూడ, బోలక్‌పూర్, రాణిగంజ్, గాంధీనగర్, జీరా తదితర ప్రాంతాల్లోని పార్కులు దయనీయంగా తయారయ్యాయి.

**ఒకే నిచ్చెన ఉండటంతో ఆలస్యమవుతుంది.**

ప్రజల నుంచి ఫిర్యాదులు ఎక్కువగా ఉన్నాయి. అయితే పరిష్కారానికి సరైన యంత్రాలు, సిబ్బంది లేకపోవడంతో కాస్త ఆలస్యం జరుగుతుంది. రెండు సర్కిళ్లకు కలిపి ఒకటే నిచ్చెన ఉంది. దాంతో సమస్యల పరిష్కారానికి ఇబ్బంది కలుగుతుంది. అంతర్గత సమస్యలను అధికమించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం.

– రాఘవేంద్ర, ఉద్యానవన శాఖ అధికారి

## కుటుంబ సభ్యులతో గడపడం ఆహ్లాదాన్నిస్తుంది



మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

అడ్డగుట్ట: విధి నిర్వహణలో భాగంగా నిత్యం పని ఒత్తిడితో ఉండే ఉద్యోగులు కొంత సమయాన్ని కుటుంబ సభ్యులతో గడిపేందుకు కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని ఆర్‌ఆర్‌సీ గ్రౌండ్‌లో హెడ్‌డీహెఫ్‌సీ బ్యాంకు ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులతో నిర్వహించిన జోష్ క్రీడా ఈవెంట్‌కు ఆయన హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్న ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో ఒక వేదిక చేసుకొని కలుసుకోవడం ఆహ్లాదం, సంతోషంగా ఉంటుందని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల మధ్య స్నేహబంధాలు బలపడటమే కాక పని ఒత్తిళ్ల నుంచి కొంత ఉపశమనం పొందే అవకాశం ఉంటుందన్నారు. హెడ్‌డీఎఫ్‌సీ బ్యాంకు యాజమాన్యం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం పట్ల వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ప్రతినిధులు డీవీఎస్. రాజు, బద్రి విశాల్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి**



చెక్కు అందజేస్తున్న మంత్రి

సనత్‌నగర్: అర్హులైన ప్రతిఒక్కరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బేగంపేట డివిజన్‌కు చెందిన మహ్మద్ రహీముద్దీన్‌కు మంజూరైన రూ.1.50 లక్షల సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ పత్రాలను ఆదివారం మంత్రి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మహ్మద్ రహీముద్దీన్ ఆస్పత్రిలో చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానిక నేత నెరేళ్ల శేఖర్‌ముదిరాజ్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి సహకారంతో మంత్రికి విన్నవించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలు కేవలం తెలంగాణలోనే అమలవుతున్నాయన్నారు. ఈ సందర్భంగా మంత్రి, కార్పొరేటర్ మహేశ్వరి, బీఆర్‌ఎస్ నాయకుడు శేఖర్‌ముదిరాజ్‌కు రహీముద్దీన్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ముగిసిన కోటి కుంకుమార్చన



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవాలయంలో నిర్వహిస్తున్న కోటి కుంకుమార్చన పూజలు ఆదివారం ముగిశాయి. గత నెల 26వ తేదీన ఈ పూజాది కార్యక్రమాలను దేవాలయంలో ప్రారంభించగా 11 రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. చివరి రోజు ఆదివారం నిర్వహించిన శాంతి హోమం, పూర్ణాహుతి, విశేష పూజలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి, చైర్మన్ కామేష్ పాల్గొన్నారు.



## బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ నియామకం

కంటోన్మెంట్: దాదాపు ఏడాదిన్నర సుదీర్ఘ విరామం అనంతరం ఎట్టకేలకు బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ నియామకం జరిగింది. కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని బోయిన్‌పల్లి కూరగాయల మార్కెట్ నగరంలోనే అతి పెద్దది. రాగిరి హారిక చైర్మన్‌గా, వేణుగోపాల్ రెడ్డి వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. బండి రామకృష్ణ, మీనా భాస్కర్, దేవులపల్లి శ్రీనివాస్, బి. నారాయణ, ఎం. గిరిధర్, డి.శ్రీనివాస్ గౌడ్, షేక్ నయీమ్, ఎస్. సుశాంత్ రెడ్డి, బి. భాస్కర్, జవహార్, శ్రీరాముల ప్రభాకర్, లోధా అభయ్ గౌతమ్ చాంద్‌ను సభ్యులుగా నియమించారు. వీరితో పాటు హైదరాబాద్ డీసీసీబీ అధ్యక్షులు, మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్, హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్, హైదరాబాద్ నగర మేయర్లు సభ్యులు ఉంటారు. సోమవారం నూతన మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం జరగనున్నట్లు సమాచారం.

## ఓయూలో విద్యార్థి నేతల అరెస్ట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో బీబీసీ డాక్యుమెంటరీ పై చర్చను పోలీసులు అడ్డుకున్నారు. ఆదివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ, బీఆర్‌ఎస్వీ, గిరిజన శక్తి ఆధ్వర్యంలో గుజరాత్ అల్లర్లపై బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీ పై చర్చ జరుపుతుండగా పోలీసులు అడ్డుకొని విద్యార్థి నేతలను అరెస్ట్ చేశారు. వర్సిటీల్లో బీబీసీ డాక్యుమెంటరీ ప్రదర్శనలపై యూజీసీ నిషేధం విధించడం సిగ్గుచేటని, వెంటనే ఎత్తివేయాలని విద్యార్థి నేతలు ధ్వజమెత్తారు. ఓయూలో ప్రదర్శనకు అనుమతి కోరగా అధికారులు యూజీసీ నిర్ణయం మేరకు అనుమతి నిరాకరించిందని పేర్కొన్నారు.

## పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య



సుహాస్(ఫైల్)

లాలాపేట: పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రమేష్ నాయక్ వివరాల ప్రకారం.. తార్నాకకు చెందిన సుహాస్ (28), గత ఏడేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీనికి సంబంధించి బెంగళూరులో చికిత్స తీసుకుంటున్నాడు. శనివారం యశోదా హాస్పిటల్‌కు ఓ టెస్టు కోసం వెళ్లొచ్చాడు. ఆదివారం తెల్లవారుజాము పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గతంలో సుహాస్‌కు పలుమార్లు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సీఐ తెలిపారు.

## గాంధీ హట్స్‌లో కమ్యూనిటీ హాల్ ప్రారంభం



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే సాయన్న

కంటోన్మెంట్: గాంధీ హట్స్‌లో ఇకపై పరదాలు కట్టుకుని కార్యక్రమాలు నిర్వహించుకునే పరిస్థితి ఉండదని ఎమ్మెల్యే సాయన్న అన్నారు. నిధుల లేమితో అసంపూర్తిగా నిలిచిపోయిన గాంధీ హట్స్ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించిన ఎమ్మెల్యే ఎట్టకేలకు పనులు పూర్తి చేయించారు. ఆదివారం బస్తీవాసుల సమక్షంలో కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించి మాట్లాడారు. వైఎంసీఏ చౌరస్తా సమీపంలో ప్రధాన రహదారిని ఆనుకుని ఉండే గాంధీ హట్స్ బస్తీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తాను గతంలోనే నిధులు ఇచ్చానని తెలిపారు. నిధుల లేమితో ప్రతిపాదిత నిర్మాణాన్ని పూర్తి చేయలేక స్లాబు మాత్రమే వేసి వదిలేయాల్సి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో బస్తీవాసులు చిన్నపాటి శుభకార్యాలకు పరదాలు కట్టుకుని శుభకార్యాలు జరుపుకునే పరిస్థితి ఉండేదన్నారు. స్థానికులు కమ్యూనిటీ హాల్‌ను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పనస సంతోష్, రాజేందర్, కుమార్, మల్లేశ్, సత్యనారాయణ, ఇస్మాయిల్, ప్రభాకర్, సాయి కుమార్, విక్కీ, బాబు, నూర్, శేఖర్, ముప్పిడి మధుకర్, టీఎస్ శ్రీనివాస్, నళిని కిరణ్ పాల్గొన్నారు.

## క్రీడోత్సవాల్లో భాగస్వాములవ్వాలి



రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న నాయకులు

సనత్‌నగర్: ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా 'ఖేలో తెలంగాణ-జీతో తెలంగాణ' క్రీడోత్సవాల్లో భాగస్వాములవ్వాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. సనత్‌నగర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అధ్యక్షుడు కన్నూరి క్రాంతి కుమార్, జిల్లా స్పోర్ట్స్ సెల్ కన్వీనర్ దయానంద్ ఆధ్వర్యంలో క్రీడా మైదానాలను సందర్శించి అక్కడి క్రీడా కారులందరికీ రిజిస్ట్రేషన్ పత్రాలను అందించారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా నియోజకవర్గాల వారీగా పోటీలు జరుగుతాయన్నారు. క్రికెట్, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ (రన్నింగ్) 100మీ, 200మీ విభాగాల్లో పోటీలు జరుగుతాయని వివరించారు. 10వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందని, 21, 22, 23 తేదీల్లో పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆకూరి శ్రీనివాసరావు, కన్నూరి చంద్రకుమార్, సిర్మనీ నరేష్, సరితాగౌడ్, మాధవి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## స్టడీ మెటీరియల్ అందజేత



మెటీరియల్ అందజేస్తున్న డీసీపీ మధుకర్ స్వామి

కంటోన్మెంట్: పోలీస్ శిక్షణ అభ్యర్థులకు ఉద్యోగం సాధించడమే లక్ష్యం కావాలని పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, రాచకొండ డీసీపీ (క్రైమ్స్) పరవస్తు మధుకర్ స్వామి అన్నారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని ఎస్వీఐటీ కళాశాల ప్రాంగణంలో ఇటీవల నిర్వహించిన ఉచిత శిక్షణ అర్హత పరీక్షల్లో మెరిట్ సాధించిన అభ్యర్థులకు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, లయన్స్ ఇంటర్నేషనల్ క్లబ్ గ్రీస్ ల్యాండ్స్, రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇష్టంతో చదివితే ఏదైనా సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మికుమారి, రఘునాథ్ రెడ్డి, ప్రొఫెసర్ జ్యోతి గుప్తా పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లకు అండగా ఉంటా



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న శ్రీగణేష్

రసూల్‌పురా: ఆటో డ్రైవర్లకు తాను అండగా ఉంటానని శ్రీ గణేష్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీ గణేష్ తెలిపారు. కంటోన్మెంట్ నియోజకవర్గం అన్నానగర్‌లో ఆదివారం ఆయన పర్యటించారు. సీసీ కెమెరాలు లేకపోవడంతో ఆటో స్టాండ్‌లో పార్కింగ్ చేసిన ఆటోల్లో మద్యం తాగుతూ ఆటో స్టాండ్‌లోనే మలమూత్రాలు కానిచ్చేస్తున్నారన్నారు. అదే విధంగా ఆటోస్టాండ్ సమీపంలో చిన్న ఆలయం నిర్మిస్తే ఆధ్యాత్మికత వాతావరణం ఉంటుందని ఏలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావుండదని శ్రీ గణేష్‌కు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ గణేష్ ఆలయ నిర్మాణానికి తన వంతుగా వెంటనే విరాళాన్ని అందజేశారు. అదే విధంగా సీసీ కెమెరాల ఏర్పాటులో తన వంతుగా 50 శాతం డబ్బులు అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజయ్య గౌడ్, నర్సింహ, వినయ్, లింగం, గోపాల్ పాల్గొన్నారు.

## వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

అడ్డగుట్ట: అడ్డగుట్టలోని ఎంసీపీఐ(యూ) కార్యాలయంలో పోలిట్‌బ్యూరో సభ్యులు, ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి తాండ్ర కుమార్ వర్ధంతి సభ వాల్‌పోస్టర్‌ను ఆదివారం పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు మల్లేష్ మాట్లాడుతూ.. ఫిబ్రవరి 14 నుంచి 20 తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించబోయే అమరజీవి తాండ్ర కుమార్ వర్ధంతి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 14న మియాపూర్‌లో జరిగే తాండ్ర కుమార్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కిష్టయ్య, రాజేష్, రాజు, లక్ష్మణ్, రాజమణి, జయశ్రీ, యాదగిరి పాల్గొన్నారు.

## దైవాన్ని ఆరాధించడం ఎంతో ముఖ్యం



సుదీక్షా మహరాజ్ ఆశీర్వాదం తీసుకుంటున్న డీజీపీ అంజనీకుమార్

రసూల్‌పురా: దైవాన్ని ఆరాధించడం ఎంతో ముఖ్యమని దీని ద్వారా ప్రశాంతమైన జీవితం సొంతమవుతుందని మహారాష్ట్ర నిరంకారి సద్గురు మాతా సుదీక్షజీ మహరాజ్ తెలిపారు. కంటోన్మెంట్ సిక్‌విలేజ్ మడ్‌ఫోర్ట్ హాకీ మైదానంలో సంత్ నిరాంకారి సద్గురు మాతా సుదీక్షా మహరాజ్ ఆధ్వర్యంలో ఆదివారం నిరాంకారి సంత్ సమాగంలో భాగంగా మానవ ఐక్యతా సందేశాన్ని మాతా వివరించారు. జీవహింస మహా పాపమని శాఖహారం ఎంతో ఉత్తమం అన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ హాజరై ఆశీర్వాదం తీసుకున్నారు.

## సభకు తరలిన నేతలు



లాలాపేట: రాష్ట్ర ప్రభుత్వం కుమ్మరి ఆత్మగౌరవ భవనం కోసం ఉప్పల్ భగాయత్‌లో కేటాయించిన స్థలంలో ఆదివారం కుమ్మర్ల ఆత్మగౌరవ భవన భూమిపూజ, సభ జరిగింది. ఈ కార్యక్రమానికి సికింద్రాబాద్ నియోజకవర్గం తార్నాక నుంచి అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మల్లికంటి వీరన్న, వెంకటేశ్వర్లు, నరేష్, శివానంద్, శ్రీనివాసులు, ప్రభాకర్, శంకర్ పాల్గొన్నారు.

### రోడ్డేస్తారు.. మళ్లీ తవ్వుతారు!



తార్నాక-లాలాపేట ప్రధాన రహదారిలో ఇటీవలే నూతనంగా తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. రోడ్డు వేసి నెల రోజులైనా కాలేదు అప్పుడే మళ్లీ మ్యాన్‌హోళ్ల నిర్మాణానికి తవ్వడం మొదలుపెట్టారు. రోడ్డు నిర్మాణానికి ముందే మ్యాన్‌హోళ్ల మరమ్మతులు చేపడితే ప్రజాధనం వృథా కాదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేసున్నారు.

– లాలాపేట